అయ్యో పాపం.. ఎంపీడీవో

వైసీపీ రాజకీయాలకు బలి

పాటదారుడు రేవు పాట బకాయి కట్టకపోవడంతో ఆందోళన

ఒత్తిడి భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నట్టు భార్యకు మెసేజ్



ఎంపీడీవో రమణరావు

నర్సాపురం రూరల్ జూలై 16: నర్సాపురం ఎంపీడీవోగా పనిచేసిన వెంకట రమణరావు విధి నిర్వహణలో పొరపాటుకు తావివ్వరు. ఎన్నికల సమయంలో కృష్ణా జిల్లా నుంచి బదిలీపై నర్సాపురం వచ్చారు. వైసీపీ రాజ కీయ కుయుక్తులకు బలైపోయారు. మరి కొద్ది నెలల్లో పదవీ విరమణ చేయనున్న సమయంలో స్థానికంగా రాజకీయ పరిస్థితులు అతనిని బలిచేశాయి. రేవుపాటలో నిర్వాహకుడు రెడ్డప్ప ధవేజీ ముందస్తు వ్యూహాన్ని పసిగట్టలేకపోయారు. ఈ ఏడాది మార్చితో నరసాపురం ఫెర్రీ రేవు పాట పూర్తయింది. ఈ సమయంలో ఎన్నికల కోడ్ వల్ల కొత్త ఆర్థిక సంవత్సరంలో పాట నిర్వహించ లేదు. జాయింట్ యాక్షన్ కమిటీ సిఫారసు మేరకు పాత పాటదారుడు వైసీపీ నేత రెడ్డప్ప ధవేజీకి రోజువారీ పద్ధతిపై రేవు నిర్వహణ బాధ్యతలను అప్పగించారు. గతంలో పాట కాలం పూర్తయితే అధికారులే పర్యవేక్షించేవారు. కృష్ణా జిల్లా నుంచి ఎన్నికల ముందు వచ్చిన వెంకటరమణరావుకు ఇక్కడ పరిస్థితులు బొత్తిగా తెలియవు. దాంతో ధవేజీని, వైసీపీ నేత ముదునూరి ప్రసాద్‌రాజుపై నమ్మకం పెట్టుకున్నారు. రోజువారీ రూ. 1.05 లక్షల చెల్లించాల్సిన ధవేజీ క్రమేపీ రూ. 50 లక్షల వరకు బకాయి పడ్డారు. పాట కాలం పూర్తయినప్పుడే గ్యారంటీ కోసం ఇచ్చిన దస్తావేజులను తీసుకున్నారు. ఆ తర్వాత ఎటువంటి పూచీ కత్తు ఉందో తెలియదు. కేవలం వైసీపీ నేతల భరోసాతో ధవేజీకి మళ్లీ రేవు నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. తీరా రూ. 50 లక్షలు బకాయి పడిన ధవేజీ హైదరాబాద్ నుంచి రాలేదు. ముఖం చాటేశారు. మాజీ ప్రజాప్రతినిధి ముదునూరి ప్రసాద్‌రాజు వద్దకు వెళ్లినప్పటికీ ఫలితం లేకపోయింది. ధవేజీ బకాయిపడ్డ రూ. 50 లక్షలకు భరోసా లేకుండా పోయింది. దాంతో ఎంపీడీవో భయపడ్డారు. ఎంఎల్ఏగా కూటమి తరపున ఎన్నికైన నాయకర్ ఒక దశలో ఎంపీడీవోకు భరోసా ఇచ్చారు. ధవేజీని మాత్రమే బాధ్యుడిని చేస్తామని ధైర్యాన్ని ఇచ్చారు. అయినాసరే రమణారావు సెలవుపై వెళ్లిపోయారు. ధవేజీకి రేవు నిర్వహణ బాధ్యతలు అప్పగించిన జాయింట్ యాక్షన్ కమిటీ బాధ్యత నుంచి తప్పుకుంది. రేవు నిర్వహణ సొమ్ములు చెల్లించడం లేదంటూ జిల్లా పంచాయతీ అధికారికి ఎంపీడీవో రమణారావు లేఖ రాసినా స్పందన లేకుండా పోయింది. చివరకు సెలవులో ఉన్న రమణారావు ఇంటినుంచి వెళ్లిపోవడం, చనిపోతానంటూ భార్యకు మెస్సేజ్ పెట్టడం వంటి ఘటనలు నర్సాపురంలో తోటి సిబ్బందిని కలిచివేశాయి.

సహకార సంఘాల్లో వైసీపీ నేతలు పందికొక్కుల్లా మింగేశారు. రైతులకు ఇవ్వాల్సిన ధాన్యం కమీషన్‌ను సొంత జేబుల్లోకి మళ్లించారు. అప్పటి నియోజకవర్గ స్థాయి ప్రజా ప్రతినిధులకు లక్షలాది రూపాయలు ముట్ట చెప్పారు. జిల్లాలో ఇలా రూ.10 కోట్లు సొమ్ములు పక్కదారి పట్టాయి. కూటమి నేతలు ఇప్పుడు దీనిపై దృష్టి పెడితే సహకార సంఘ అధికారులు నోరెళ్ల బెడుతున్నారు.



బొక్కేశారు

సహకార సంఘాల్లో రూ.10 కోట్లు హాంఫట్

కమీషన్ సొమ్ములు ఖర్చయిపోయాయని లెక్కలు

సొసైటీలకు దక్కని ఫలితం

రైతులకు ఇవ్వని ఛార్జీలు

మింగేసిన వైసీపీ నేతలు



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

రైతులకు రవాణా చార్జీలు ఇవ్వాలంటూ వైసీపీ ప్రభుత్వంలో సొసైటీలకు రూ.10 కోట్లు నిధులు జమ చేశారు. ధాన్యం కమీషన్ రూపంలో ఆ మొత్తాన్ని సొసైటీల ఖాతాల్లో జమ చేశారు. రైతులకు ఇవ్వాల్సిన సొసైటీలు వాటిని దుర్వినియోగం చేశాయి. రైతుకు ఇవ్వకుండా వైసీపీ నేతలు బొక్కేశారు. నియోజకవర్గానికి ప్రాతి నిధ్యం వహించిన నేతలతో పాటు, త్రిసభ్య కమిటీ చైర్మన్‌లు రైతుల ధాన్యం కమీషన్‌ను సర్దుబాటు చేసుకున్నారు. సొసైటీ ఖాతాల్లో జమ అయిన సొమ్ములకు లెక్కలుండాలి. ఎవరికి సర్దుబాటు చేశారో తెలియాలి. అప్పట్లో రైతులు కూడా రవాణా చార్జీలు చెల్లించాలంటూ ధర్నాలు చేశారు. అయినా వైసీపీ ప్రభుత్వం పట్టిం చుకోలేదు. ఆ సొమ్ములకు సొసైటీల్లో లెక్కలు చూపేశారు. ఖర్చు అయి పోయా యంటూ తేల్చేశారు. ఆడిట్ కూడా పూర్తయ్యింది. ఆడిట్ అధికారులు కూడా క్లియరెన్స్ ఇచ్చేసినట్టు కూటమి నేతలు గుర్తించారు. మొత్తంపైన రూ. 10 కోట్ల నిధులు దుర్వినియోగం అయిపోయాయి. ఆ తర్వాత ప్రభుత్వం మిగిలిన సొమ్ములు విడుదల చేయలేదు. తొలి విడత ఒక్క పశ్చిమగోదావరి జిల్లాకే కమీషన్ సొమ్ము రాబట్టారు. వాటిని రైతులకు చెల్లించాలని సూచించారు. క్వింటాల్‌కు రూ. 6 మాత్రమే సొసైటీలు వినియోగించుకోవాలని వైసీపీ ప్రభుత్వం స్పష్టం చేసింది. వాస్తవానికి ప్రతి క్వింటా ధాన్యానికి కేంద్ర ప్రభుత్వం రూ.31.25 మంజూరు చేస్తుంది. అందులో రూ. 6 సొసైటీలు వినియోగించుకో వాలంటూ వైసీపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మిగిలిన రూ. 25.25 రైతులకు చెల్లించాలి. కానీ జిల్లాలో వైసీపీ నేతలు ఆ సొమ్మంతా మింగేశారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధులకు 60 శాతం సొమ్ములు ముట్ట చెప్పారు. మిగిలిన 40 శాతం సొమ్ములను త్రిసభ్య కమిటీ చైర్మన్‌ల జేబుల్లోకి వెళ్లిపోయాయి. ఆడిట్ జరిగితే దందా బయటకు వస్తుందని అంతా భావించారు. కానీ ఆడిట్‌లో అంతా సవ్యంగా సాగిపోయింది. నిధులంతా ఖర్చయిపోయాయని ఆడిట్ విభాగం ఆమోదం తెలిపింది. అంటే తదుపరి న్యాయపరమైన చిక్కులు ఎదుర్కోకుండా వైసీపీ నేతలు ముందుజాగ్రత్త పడ్డారు. కూటమి నేతలు ఒత్తిడి చేస్తే ఏ నేతకు ఎంత ముట్ట చెప్పామనేది ఇప్పుడు అధికారులు వెల్లడిస్తున్నారు. వైసీపీ హయాంలో సహకార సంఘాల్లో జరిగిన అవినీతిని చూసి కూటమి నేతలు నోరెళ్ల బెడుతున్నారు.

డీసీసీబీకి లాభసాటి

గతంలో ప్రభుత్వం ధాన్యం కమీషన్‌ను పూర్తిగా సొసైటీలకు అప్పగించాయి. క్వింటా ధాన్యానికి కేంద్రం ఇచ్చిన రూ. 31.25 సొసైటీలే వినియోగించుకునేవి. ఆ తర్వాత కాలంలో కమీషన్ సొమ్మును సొసైటీల పేరుతో జిల్లా సహకార బ్యాంకులో జమ చేస్తూ వచ్చారు. వడ్డీ మాత్రమే సొసైటీలకు చెల్లిస్తున్నారు. ఏడాదికి 8 శాతం వడ్డీ లభిస్తోంది. అదే సొసైటీలకు పూర్తి స్థాయిలో కమీషన్ జమ చేస్తే రైతులకు రుణాలు ఇవ్వడం ద్వారా 12 శాతం వడ్డీ వచ్చేది. సొసైటీలకు లాభసాటి అయ్యేది. జిల్లాలో ధాన్యం కమీషన్‌ను సొసైటీలు దుర్వినియోగం చేస్తున్నాయన్న ముద్ర పడడంతో జిల్లా సహకార బ్యాంకుల్లో కమీషన్ సొమ్ములను జమ చేశారు. అలాగైనా సరే సొసైటీలకు వడ్డీ రూపంలో కొంత మొత్తం వచ్చేది. వైసీపీ ప్రభుత్వం రైతులకు ఇవ్వాలని ఆదేశాలు ఇవ్వడంతో నేతల కన్ను ధాన్యం కమీషన్‌పైనా పడింది. నిధు లను దారిమళ్లించారు. సొంతానికి వాడుకున్నారు. ఇటు రైతులకు ఇవ్వలేదు. సొసైటీలకూ ఉపయోగపడలేదు.

కమీషన్ పక్కదారి

ధాన్యం కమీషన్ సొమ్మును వైసీపీ ప్రభుత్వం సొసైటీలకు విడుదల చేయలేదు. వైసీపీ ప్రభుత్వం పూర్తిగా వాటిని దారి మళ్లించింది. బకాయిలు చెల్లించకుండా తాత్సారం చేసింది. ఇలా జిల్లాలో సొసైటీలకు రూ.100 కోట్లు చెల్లించాల్సి ఉంది. కేంద్రం నుంచి ఎప్పటికప్పుడు నిధులు విడుదలయ్యేవి. ప్రభుత్వం కమీషన్ సొమ్ములు విడుదల చేయకపోవడంతో సొసైటీలు ఎదురు పెట్టుబడి చేయాల్సి వస్తోంది. ఐదేళ్లపాటు వైసీపీ ప్రభుత్వం సొసైటీలకు ఎన్నికలు నిర్వహించలేదు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో త్రిసభ్య కమిటీలు వేసింది. దాంతో ప్రభుత్వంపై కమిటీలు ఒత్తిడి చేయలేకపోయాయి. కమీషన్‌ను తెప్పించుకునే సాహసం చేయలేదు. జిల్లా అధికారుల చొరవతో రూ. 10 కోట్లు విడుదల చేస్తే అది కూడా నేతలు దోచుకున్నారు. సహకార సంఘాలపై దోపిడీపై ఇప్పుడు కూటమి నేతలు దృష్టి పెట్టారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

గల్ఫ్ వర్కర్ల సహాయ కేంద్రం ఏర్పాటు

భీమవరం టౌన్, జూలై 16 : జిల్లాలో గల్ఫ్ వర్కర్ల కోసం సహాయ కేంద్రం ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. దీనికోసం డీఆర్‌డీఏ, పోలీస్, ఐసీడీఎస్, కార్మిక శాఖల సిబ్బందితో టీమ్ ఏర్పాటు చేయనున్నారు. ఆగస్టు 6 న గుర్తింపు పొందిన, పొందని ఏజెన్సీలతో వర్క్ షాప్ నిర్వహించేందుకు సన్నాహం చేస్తున్నట్లు చెప్పారు. ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న మహిళా వర్కర్ల ఆవేదనను ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా తెలుసుకున్న కలెక్టర్ ఇక ఏ ఒక్క మహిళ మోసపోకూడదనే లక్ష్యంతో చర్యలను వేగవంతం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఓవ ర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ ఏపీ లిమిటెడ్ ప్రతినిధులు, సంబంధిత అధికారులతో సమావేశమై గల్ఫ్ సురక్షిత వలసలపై సమీక్షించారు. జిల్లాలో ఉపాధి మార్గాలు మెండుగా ఉన్నాయని మహిళలు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ వేణుగోపాల్, జిల్లా కార్మికశాఖ అధికారి ఆకన లక్ష్మి, ఐసీడీఎస్ పీడీ బి.సుజాత రాణి, జిల్లా నైపుణ్యా శిక్షణ అభివృద్ధి అధికారి కృష్ణారెడ్డి, కంపెనీ జనరల్ మేనేజర్ క్రాంతికుమారి, హెచ్‌ఆర్ బి.సతీష్‌బాబు పాల్గొన్నారు.



రోడ్డెక్కిన ఇసుక లారీలు

టిప్పర్ లారీల సమ్మె విరమణ

తూర్పుగోదావరి జిల్లాలో ఆధార్‌తో ఇసుక ఎగుమతులు

7



భీమవరం మండలంలో లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్న దృశ్యం

టార్గెట్.. 100 రోజులు

గ్రామాల్లో పేదల ఇళ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ఆదేశం

భీమవరం రూరల్, జూలై 16 : గృహనిర్మాణ కార్పొరేషన్‌కు ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. పేదల ఇల్లును వందరోజులలో పూర్తి చేయాలని ఆదేశించింది. ఇప్పటికే వివిధ దశలలో నిర్మాణంలో ఉన్నా గృహాలు పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించింది. ఆ దిశగా జిల్లా గృహ నిర్మాణశాఖ అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులు ముందుకు వెళ్లడానికి ఎన్నో అవరోధాలు తలెత్తాయి. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో లేఅవుట్‌లు నిర్ణయించారు. వాటిలో 30 శాతం ఇళ్లు కూడా పూర్తి చేయలేకపోయారు. స్థలాలు ఇచ్చిన చోట మౌలిక వసతులు కల్పించలేదు. అన్నీ సవ్యంగా ఉన్నా కొన్ని చోట్ల ఆర్థికపరమైన ఇబ్బందులతో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోలేకపోయారు. దీంతో నాలుగేళ్లుగా పేదవాడి ఇంటి కల నెరవేరలేదు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 626 లేఅవుట్‌లు పేదల ఇళ్లకోసం గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వాటి నిమిత్తం నాలుగేళ్ల క్రితం పట్టాలు ఇచ్చింది. అయితే ఆ లేఅవుట్‌లు పూడిక చేయకపోవడంతో వర్షం వస్తే చెరువులుగా మారుతున్నాయి. వాటిలో ఇంటి నిర్మాణానికి లబ్ధిదారులు ముందుకు వెళ్లలేకపోయారు. ఇంతలో ఆప్షన్‌లు అంటూ లబ్ధిదారులను కన్ఫ్యూజ్ చేసింది. గడిచిన రెండేళ్లుగా ఇల్లు నిర్మించుకోకపోతే పట్టా వెనక్కి తీసుకుంటామని బెదిరింపులు వచ్చాయి. లేఅవుట్‌లలో సదుపాయాలు లేక ఆర్థిక స్తోమత సరిపోక చాలామంది లబ్ధిదారులు వెనకడుగు వేశారు. దీంతో గత ప్రభుత్వం హయాంలో జిల్లాలో 47,716 గృహాల మంజూరుకు కేవలం 9,120 గృహాలే నిర్మాణం పూర్తయ్యాయి. మిగిలినవి 38,596 గృహాలు వివిధ దశల్లో ఉండిపోయాయి. వాటి నిర్మాణం పూర్తి చేసే పనిలో టీడీపీ కూటమి ప్రభుత్వం పడింది. అదే ఇప్పుడు అధికారులకు తక్కువ సమయంలో నిర్మాణాలు పూర్తవ్వాలనే లక్ష్యాన్ని నిర్దేశించింది.

ఇంకా చెరువులుగానే లే అవుట్‌లు

వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు అయినప్పటి నుంచి లేఅవుట్‌ల ఏర్పాటు చేసి లబ్ధిదారులకు ఇచ్చింది. అయితే లేఅవుట్‌ల పూడికలో నిర్లక్ష్యం చూపింది. పూడికలలో కాంట్రాక్టర్ మోసం లబ్ధిదారులకు నష్టంగా మారింది. మొక్కుబడిగా పూడికలు చేయడంతో ఇళ్ల నిర్మాణానికి వీలుకానివిగా మారాయి. ఇప్పటికి జిల్లాలో దాదాపు 30 లేఅవట్‌ల వరకు చెరువులుగా మిగిలిపోయాయి. వేలమంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇచ్చినా ఉపయోగం లేకుండా పోయింది అలాంటి లేఅవుట్‌లలో ఇళ్ల మంజూరు నిలిపివేశారు.

జిల్లాలో పూర్తి కావాల్సిన ఇళ్లు 38,596

నాలుగేళ్లలో వైసీపీ ప్రభుత్వం నిర్మించింది..9,120

సొంత స్థలంలో నిర్మించుకునేవారు 2,278 మంది

గ్రామాలలో ప్రభుత్వం ఇచ్చిన లేఅవుట్‌లే కాకుండా సొంత స్థలాలలో ఇంటి నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులు 2,278 మంది ఉన్నారు. వారు కూడా ప్రభుత్వం నిర్దేశించిన వ్యవధిలో నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి. వారికి నిర్మాణ ధర ప్రకారం గృహ నిర్మాణశాఖ నుంచి సొమ్ములు జమ అవుతాయి.

2019 లోపు లబ్ధిదారులకు గత వైసీపీ సర్కార్ ఎగనామం

ప్రభుత్వాలు మారినా పేదలు నష్టపోకుండా నిర్ణయాలు తీసుకోవాలి. అలాంటిది గత వైసీపీ సర్కార్ చాలామంది గతంలో ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు సొమ్ములు ఎగనామం పెట్టింది. 2019 వరకు టీడీపీ ప్రభుత్వం హయాంలో గృహాలు నిర్మించుకున్నవారికి గృహ నిర్మాణశాఖ నుంచి అందాల్సిన సొమ్మును నిలుపుదల చేసింది. దీంతో అప్పట్లో వేలాది మంది ఇళ్లు నిర్మించుకున్నారు. వారంతా నష్టపోయారు. ఇప్పుడు తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అలాంటి వంకర నిర్ణయాలు తీసుకోకుండా గత ప్రభుత్వంలోని ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులందరికి సొమ్ములు అందించి సొంతింటి కల నెరవేరేలా చర్యలు చేపడుతున్నది.

ఉపాధ్యాయుల పని సర్దుబాటు పూర్తి చేయాలి : ఏపీటీఎఫ్



డీఈవో నాగమణికి వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ సభ్యులు

భీమవరం ఎడ్యుకేషన్, జూలై 16 : 2024-25 విద్యా సంవత్సరంలో పశ్చిమ గోదావరి జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్ పాఠశాలలో ఉపాధ్యాయుల పని సర్దుబాటు వెంటనే పూర్తి చేయాలని జిల్లా డీఈవో నాగమణికి ఏపీటీఎఫ్ పశ్చిమ గోదావరి జిల్లా శాఖ అధ్యక్ష కార్యదర్శులు షేక్ బాబాజీ సాహెబ్, రమణ మంగళవారం వినతిపత్రం అంద జేశారు. ఈ విద్యా సంవత్సరంలో చాలా పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడనంత ఉపాధ్యాయులు లేక బోధన కుంటుపడుతోందన్నారు. గత విద్యా సంవత్సరంలో నవంబరు నెలలో పని సర్దుబాటు వల్ల విద్యార్థులకు పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదని, ఈ విద్యా సంవత్సరంలో ఉపాధ్యాయుల పని సర్దుబాటు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని డీఈవోని కోరారు. డీఈవో స్పందిస్తూ తప్పకుండా వీలైనంత త్వరలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే స్కూల్ మెయింటినెన్స్ గ్రాంట్స్ విడుదలయ్యేలా చూడాలని డీఈవోను కోరారు. జిల్లా కార్యవర్గ సభ్యులు ఏఎస్‌వీ సుభాషిణి, వేమూరి శ్రీవల్లి, పెద్దాడ రాజేశ్వరరావు,నాగరాజు,తదితరులు పాల్గొన్నారు.



ఉద్యాన వర్సిటీలో ఫర్నిచర్ మాయం

లక్షల విలువైన వస్తువులు పోయినా లెక్కా పత్రం లేదు..

లెక్కలు అప్పగించని ఉద్యోగిపై ప్రేమ

ఏళ్ల తరబడి ఇదే తంతు.. ఎమ్మెల్యే సమీక్షించినా చర్యలు శూన్యం

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 16: ఆ విశ్వవిద్యాలయంలో అంతా మాయగా కనిపిస్తోంది. ప్రజా ధనంతో కొనుగోలు చేసిన ఫర్నిచర్, విద్యుత్ ఉపకరణాల లెక్క అంతుచిక్కడం లేదు. తాడేపల్లిగూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంలోని పదేళ్లుగా వర్సిటీ అవసరాల కోసం కొనుగోలు చేసిన ఫర్నిచర్, ఏసీలు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్‌లతో పాటు ప్రింటర్ల లెక్క తేలడం లేదు. ఈ తతంగమంతా వర్సిటీ ప్రధాన కార్యాలయం అయిన అడ్మిన్ ఆఫీసులోనే జరిగినా ఇటు ఉపకులపతి కానీ, వారి తరువాత ఉండే ఉన్నతాధికారులు కానీ పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ఐదేళ్లుగా కొనసాగుతున్న మిస్టరీ

ఐదేళ్ల క్రితం కారుణ్య నియామకంలో వర్సిటీలో పరిపాలనా విభాగంలో వరలక్ష్మి రికార్డు అసిస్టెంట్‌గా విధుల్లో చేరారు. అయితే ఆ సమయంలో లక్షల రూపాయలు వెచ్చించి ఫర్నిచర్ (టేబుల్స్ నుంచి కంప్యూటర్‌ల వరకూ) కొనుగోలు చేశారు. అయితే ఆ తరువాత ఆమె రికార్డు అసిస్టెంట్ నుంచి జూనియర్ అసిస్టెంట్‌గా తరువాత సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది అదే యూనివర్సిటీలో హెచ్‌ఆర్ఎస్ విభాగంలో పనిచేస్తున్నారు. తాను కొనుగోలు చేసిన ఫర్నిచర్ విష యంలో నేటికీ ఆమె లెక్కలు అప్పగించకపోవడం, గతంలో రెండు సార్లు ఆమెపై ఉద్యాన వర్సిటీ సిబ్బంది ఫిర్యాదు చేయడంతో నోటీసులు ఇచ్చారు.ఆరు నెలల వరకూ జీతం కూడా నిలుపుదల చేసినట్టు తెలుస్తోంది. అయినా ఫర్నిచర్ లెక్కలు అప్ప గించకుండానే ఆమెను విధుల్లో కొనసాగిస్తూ జీతం చెల్లిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. ఇదిలా ఉంటే వర్సిటీలో ఆ విభాగంలో పనిచేసిన ఏ ఉద్యోగి లెక్కలు అప్పగించలేదనే వాదన తెరమీదకు వస్తోంది. దీంతో వర్సిటీ వ్యవహారం మరింత అనుమానస్పదంగా కనిపిస్తోందని అక్కడ పనిచేసే ఉద్యోగులే మాట్లాడటం గమనార్హం.

ఎమ్మెల్యే స్వయంగా అడిగినా రాని లెక్క..

ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఇటీవల యూనివర్సిటీని సందర్శించి పరిపాలన, అభివృద్ధిపై సమీక్షించారు. అయితే ఆ సమయంలో ఫర్నిచర్ లేకపోవడం విషయంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులను కోరారు. ఆ సమయంలో రిజిస్ట్రార్ శ్రీని వాసులు బిల్లులు చూపించి ఫర్నిచర్ లెక్కలు తేలుస్తామని వివరణ ఇచ్చారు.

ఫర్నిచర్‌పై ఆరా తీస్తున్నాం : రిజిస్ట్రార్

యూనివర్సిటీ ప్రారంభం సమయంలో కొనుగోలు చేసినప్పటి నుంచి ఫర్నీచర్ లెక్కలు సరిగా లేవని రిజిస్ట్రార్ శ్రీనివాసులు వివరణ ఇచ్చారు.ఫర్నీచర్‌పై విషయంలో ఇప్పటికే అన్ని కళాశాలలకు లేఖలు రాశామన్నారు. ఈ వ్యవహారంపై వర్సిటీ అంత ర్భాగమైన కళాశాలలకు కొనుగోలు చేసిన ఫర్నిచర్‌పై ఆరా తీస్తున్నామని వివ రించారు. వరలక్ష్మి విషయంలోనే కాదని గతంలో పనిచేసిన ఉద్యోగుల నుంచి కూడా సమాచారం సేకరిస్తున్నామన్నారు.

వేంకటేశ్వరునిగా జగన్నాథుడు



ద్వారకాతిరుమల : అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడైన వేంకటేశ్వరునిగా జగన్నాథుడు మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీనివాసుని దివ్యమంగళ స్వరూపంలో దర్శనమిచ్చిన జగన్నాథుడిని పలువురు దర్శించి పూజలు జరుపుకున్నారు. లక్ష్మీపురం ఆలయంలో జగన్నాథ రథోత్సవాలను పురస్కరించుకుని స్వామివారు దశావతారాల్లో రోజుకో అలంకరణలో భాగంగా ఉత్సవాల ముగింపు రోజైన మంగళవారం వేంకటేశ్వరుడి అలంకరణ ఆకట్టుకుంది.

రోడ్డెక్కిన ఇసుక లారీలు

టిప్పర్ లారీల సమ్మె విరమణ

- తూర్పుగోదావరి జిల్లాలో ఆధార్‌తో ఇసుక ఎగుమతులు
- వరద తగ్గితే ధర తగ్గే అవకాశం

పాలకొల్లు, జూలై 16 : ఇసుక ఎగుమతి ధర తక్కువే.. కిరాయి అధికం.. ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఇసుకను సరఫరా చేసే టిప్పర్ లారీలు సమ్మె విరమించి రోడ్డు ఎక్కాయి. ఐదు రోజులుగా సుమారు 1500 లారీలు సమ్మెలో పాల్గొనడంతో ఉమ్మడి పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల్లో ఇసుక సరఫరా నిలిచిపోయింది. తూర్పుగోదావరి జిల్లాలో ఇసుకను ఆధార్ కార్డుతో ఇవ్వడానికి సంబంధిత అధికారులు అనుమతించడంతో మంగళవారం నుంచి ఇసుక ఎగుమతులు ప్రారంభమయ్యాయి. ఔరంగబాద్ పడవ ర్యాంపు నుంచి మంగళవారం ఉదయం లాంఛనంగా ఇసుక ఎగుమతులు ప్రారంభించారు. పెండ్యాల, తీపర్రు, రావులపాలెం, స్టాక్‌పాయింట్‌ల నుంచి ఎగుమతి అవుతుంది. ఉభయ గోదావరి జిల్లాలతో పాటు కృష్ణా జిల్లాకు అధికంగా ఇసుక తరలిస్తున్నారు. ధర తక్కువే.. స్టాక్ పాయింట్‌లలో టన్ను ఇసుక ధర రూ.270 ఉంది. అయితే ఐదు యూనిట్ల లారీకి 20 టన్నుల ఇసుక ఎగుమతి అవుతంది. సుమారు 4.5 యూనిట్లు పరిమాణం కలిగి ఉంటుంది. గతంలో 5 యూనిట్లు ఇసుక ధర వినియోగదారునికి చేరే సరికి రూ.16 నుంచి 18 వేలుగా ఉండేది. ఇపుడు ఇసుక స్టాక్ పాయింట్‌లలో కొనుగోలు ధర 20 టన్నులు రూ. 5,400 గా ఉన్నప్పటికి కిరాయి తడిచిమోపెడైంది. స్టాక్ పాయింట్‌లలో ఎగుమతులకు వెళ్లిన ఇసుక లారీలు 2 లేదా 3 రోజులు వెయిటింగ్‌లో ఉండాల్సి రావడంతో వెయింటింగ్ పిరియిడ్ సైతం లారీ యజమానులు కిరాయి వేసుకున్నారు. వాస్తవంగా ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఐదు యూనిట్లు ఇసుక దూరాన్ని బట్టి ఆయా ప్రాంతాలకు కిరాయితో కలిపి రూ. 10 లేదా 11 వేలకు చేరాలి. ఇప్పుడు లారీలు రోజులు తరబడి స్టాక్ పాయింట్‌లలో వెయింటింగ్‌లో ఉండడం కారణంగా రూ.10 వేలు కిరాయి తీసుకుంటున్నారు. అంటే కిరాయితో కలుపుకుని ఇసుక వినియోగదారనికి చేరు సరికి 5 యూనిట్లు రూ. 15 నుంచి 16 వేలు ఖర్చు అవుతుంది.



ఇసుక (ఫైల్)

వరద తగ్గితే ధర తగ్గే అవకాశం

గోదావరికి వరదలు తగ్గితే నేరుగా బాటలు ఏర్పాటు చేసి నదిలో ఇసుక ఎగుమతి చేసే అవకాశం ఉంటుంది. అపుడు లోడింగ్ చార్జి మాత్రమే ఖర్చు అవుతుంది. అప్పటికి ఇసుక ధర ఐదు యూనిట్లు వినియోగదారుడికి చేరే సరికి రూ.5వేల నుంచి రూ.6 వేలకు వచ్చే అవకాశం ఉందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

ఉచితం ఊత పదమే.. !

ఉచిత ఇసుక విధానం అమల్లోకి వచ్చినప్పనటికి వినియోగదారునికి ఊరట లభించడం లేదు. ఎందుకంటే కిరాయి రెండు రెట్లు కావడంతో గత జగన్‌రెడ్డి పాలనతో ఇసుక ఎంత అమ్మారో ఇప్పుడూ అదే ధర పలుకుతుంది. దీంతో ఇసుక వినియోగదారులు పెదవి విరుస్తున్నారు. ఇసుక ఉచిత విధానాలు ఈవిధంగానే ఉంటే కూటమి ప్రభుత్వం అబాసుపాలయ్యే పరిస్థితులు ఉన్నాయి.

2014లో ఉచిత ఇసుక విధానం..

నవ్యాంధ్ర ఏర్పడిన దరిమిలా 2014లో అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు ఉచిత ఇసుక విధానం అమల్లోకి తెచ్చారు. అప్పటి పశ్చిమ గోదావరి జిల్లాలో ఐదు యూనిట్ల ఇసుక దూరాన్ని బట్టి రూ.4వేల నుంచి రూ.5 వేలకు లభించేది. నేరుగా బాటలు ఉండి లారీలు నదిలోకి వెళ్లే ర్యాంప్‌లలో కేవలం లారీ ఎగుమతికి రూ. 300 నుంచి రూ.500 ఖర్చు అయ్యేది. లారీ కిరాయి డ్రైవర్ బేటాలు అన్నీ కలిపినా కేవలం రూ. 4వేల నుంచి రూ.5 వేలకు ఐదు యూనిట్ల ఇసుక వచ్చేది. ఇపుడు ప్రభుత్వం స్టాక్ పాయింట్ వద్దకు ఇసుక చేర్చిన రవాణా చార్జీలు అక్కడ ఎగుమతి చార్జీలు కలిపి టన్నుకు రూ.270 వసూలు చేయడంతో 20 టన్నులకు రూ.5 వేల 400 ఖర్చు అవుతుంది. ఈ విధంగా లెక్కిస్తే కిరాయితో కలిపి రూ.15 వేలు పైబడి వినియోగదారులకు ఖర్చు అవుతుంది. ఐదు యూనిట్లుగా చెప్పబోతున్నప్పటికి 20 టన్నులకు నాలుగున్నర యూనిట్లు ఇసుక వస్తుంది.

స్లాట్ విధానం అమలు చేయాలి

స్టాక్ పాయింట్‌లలో ఎగుమతికి వెళ్లిన ఇసుక లారీలు రోజులు తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా ఆన్‌లైన్ విధానంలో ఇసుక బుక్ చేసుకునే ఉండాలి. ఎగుమతికి స్లాట్ ఇస్తే ఇసుక లారీల కిరాయి తగ్గి వినియోగదారులకు ఐదు యూనిట్లకు రూ. 4 వేల నుంచి 5 వేలు మిగులుతుందని పరిశీలకులు సూచిస్తున్నారు.

నేడు తొలి ఏకాదశి



ద్వారకాతిరుమల, జూలై 16: హిందూ సంప్రదాయంలో అత్యంత ప్రాముఖ్యత ఉన్న తొలి పండుగ తొలి ఏకాదశి. ఆషాఢ మాసంలో వచ్చే తొలి ఏకాదశి రోజున శ్రీమహావిష్ణువు క్షీరసాగరంలో యోగనిద్రకు ఉపక్రమిస్తారని పురాణగాదలు చెబుతున్నాయి. బుధవారం నుంచి చాతుర్మాసం ప్రారంభమవుతుంది. ఏడాది మొత్తం మీద వచ్చే 24 ఏకాదశులు ఏదో ఒక ప్రత్యేకతను సంతరించుకుంటాయి. ఏకాదశి అంటే 11 అని అర్థం. మనుకున్న ఐదు జ్ఞానేంద్రియాలు, ఐదు కర్మేంద్రియాలు వీటిని పనిచేయించే అంతరేంద్రియం అయిన మనసు కలసి పదకొండు. ఇవన్నీ ఏకోన్ముఖంగా పనిచేసే సమయమే ఏకాదశి.

తొలి ఏకాదశి విశిష్టత

ఆషాడశుద్ధ ఏకాదశినే తొలి ఏకాదశి లేదా ప్రథమ ఏకాదశి లేదా హరివాసరం అని అంటారు. క్షీరాబ్ధి నందు మహావిష్ణువు శేషపాన్పుపై శయనిస్తారు కావున శయన ఏకాదశి అనికూడా అంటారు. ఇది ప్రకృతిలో జరిగే మార్పులకు సంకేతంగా చెప్పొచ్చు. ఉత్తర దిశగా ఉన్న సూర్యుడు ఈరోజు నుంచి దక్షిణ దిశకు వాలుతున్నట్టు కన్పిస్తాడు. ఇది దక్షిణాయనాన్ని సూచిస్తుంది. చాతుర్మాస వ్రతం ఈరోజు నుంచి ప్రారంభిస్తారు. ఈవ్రతాన్ని ఈరోజు నుంచి కార్తీక మాస శుక్ల పక్ష ద్వాదశి వరకు అంటే క్షీరాబ్ధి ద్వాదశి వరకు ఆచరించాలని పురాణాలు చెబుతున్నాయి.

తొలి ఏకాదశి జరుపుకునే విధానం..

మహిమాన్వితమైన ఈ ఏకాదశి వ్రతాన్ని ఆచరిస్తే భూదాన మిచ్చనంత, అశ్వమేధయాగం చేసినంత, 60 వేల సంవత్సరాలు తపస్సు చేసినంత పుణ్యం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. ఈ తొలి ఏకాదశి నుంచే హిందువుల అన్ని పండుగలు ప్రారంభమవుతాయి.

రైతు పండుగ కూడా..

ఇది ముఖ్యంగా రైతుల పండుగ. ఏరువాక లానే తొలి ఏకాదశి వేడుక చేసుకుంటారు. అతివృష్టి, అనావృష్టి లాంటి ప్రకృతి వైపరీత్యాలు చోటు చేసుకోకూడదని పైరుకు ఏరకమైన తెగుళ్ల సోకకూడదని మహావిష్ణువుకు నమస్కారం చేసుకుంటారు. తొలి ఏకాదశి రోజున మొక్కజొన్న పేలాలను మెత్తగా పొడి చేసి అందులో నూరిన బెల్లం కలపి దేవునికి నైవేద్యంగా సమర్పించి ప్రసాదంగా సేవిస్తారు.

ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో

ఉద్యోగాలకు దరఖాస్తులు

ఏలూరు రూరల్, జూలై 16: ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ రిక్రూట్‌మెంట్ కోసం ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 24వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఎయిర్‌ఫోర్స్ అధికారి ఎస్.సందీప్, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో అగ్నివీర్ వాయు రిక్రూట్‌మెంట్‌పై అధికారులు వివరాలు తెలిపి సంబంధిత మెటీరియల్‌ను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబర్ 18 నుంచి ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే విధంగా అన్ని కళాశాలల్లో పదిహేడు నుంచి ఇరవై ఒక్క ఏళ్ల వయస్సు ఉన్న విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. రిక్రూట్‌మెంట్ వైమానిక దళంలోకి ప్రవేశించేందుకు స్థిరమైన వృత్తిని దేశానికి సేవచేసే అవకాశాన్ని అందిస్తుందన్నారు. వెబ్‌సైట్ https://agnipathvayu.cdac.inలో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని ఆమె సూచించారు.

ఏలూరు సీఆర్ఆర్‌లో 'అగ్నివీర్ పథకం'పై సదస్సు

ఏలూరు సర్.సి.ఆర్.రెడ్డి అటానమస్ కళాశాల ఆడియో విజువల్ హాల్లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎంప్లాయిమెంట్, ట్రైనింగ్, సెట్‌వెల్, కళాశాల ఎన్‌సీసీ యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో భారత సైనిక విభాగానికి సంబంధించిన అగ్నివీర్ పథకంపై ఎన్‌సీసీ క్యాడెట్లు, ఇతర విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రామరాజు, కరస్పాండెంట్ కేఎస్ విష్ణుమోహన్, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అధికారి టి.ప్రవీణ్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి కుష్టు వ్యాధిపై ఇంటింటా సర్వే

పాలకొల్లు , జూలై 16 : కుష్టువ్యాధి రహిత భారతదేశంగా 2027 నాటికి తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో జాతీయ కుష్టువ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా ఈనెల 18వ తేదీ నుంచి ఆగస్టు 2 వరకు సంబంధిత శాఖ సిబ్బంది ఇంటింటా సర్వే చేపట్టనున్నారు. దీనిలో భాగంగా 2027 వరకు ప్రతీ ఏటా రెండుసార్లు ఇంటింటా సర్వే చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ సర్వే కార్యక్రమాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు స్థానిక డిప్యూటీ పారా మెడికల్ అధికారి జక్కంపూడి రామ ప్రసాద్ పర్యవేక్షణలో జరగనుంది. ఆరోగ్య కేంద్రాలు, ఆశాల ఆధ్వర్యంలో ఈ సర్వేతో ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయడం, అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టారు. ప్రతీ పాఠశాలకు వెళ్లి విద్యార్థులను పరీక్షించనున్నారు. వ్యాధి కారణాలు, లక్షణాలను విద్యార్థులకు వివరిస్తారు, విద్యార్థులను పరీక్షించి స్పర్శ నొప్పి లేదా దురదలేని ఎర్రని, రాగి రంగు మచ్చలు ఉంటే ముందుగానే గుర్తించడం ద్వారా అంగ వైకల్యాన్ని నివారించేందుకు అవకాశం ఉంటుంది.



పూడ్చిన బోరుబావి.. అందుబాటులో ఉన్న అగ్నిమాపక కేంద్రం

కోనపోతుగుంట బోరులో మళ్లీ సౌండ్‌లు

- ఓఎన్‌జీసీ అధికారుల పరిశీలన
- ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్థానికులకు స్పష్టత

ఆచంట, జూలై 16 : ఆచంట మండలం ఆచంట శివారు కోనపోతుగుంట బండి జయలక్ష్మి ఇంటి వద్ద ఉన్న బోరు బావిలో గతంలో సుమారు నాలుగేళ్ల క్రితం గ్యాస్ లీకేజీ సౌండ్ రావడంతో అప్పట్లో ఓఎన్‌జీసీ అధికారులు పర్యవేక్షణలో బోరు బావిని కాంక్రీటుతో పూర్తిగా పూడ్చి వేశారు. మళ్లీ అదే బోరు బావి నుంచి మంగళవారం సాయంత్రం గ్యాస్ మాదిరిగా లీకేజీ సౌండ్ రావడంతో మళ్లీ రాజమండ్రిలో ఉన్న ఓఎన్‌జీసీ అధికారులకు సమాచారం ఇచ్చారు. హుటాహుటిన జిల్లా ఫైర్ అధికారి శ్రీనివాసరావు, నరసాపురానికి చెందిన ఓఎన్‌జీసీ అధికారులు, సిబ్బంది ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. స్థానికులు ఎటువంటి భయాందోళనలకు చెందాల్సిన అవసరం లేదని పూర్తిస్థాయిలో పరిశీలించి మరోసారి బోరుబావిని పూడ్చేందుకు ఓఎన్‌జీసీ అధికారులు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. అగ్నిమాపక కేంద్రాన్ని సిద్ధం చేసుకున్నారు. ఈ మేరకు స్థానికుల్లో మరోసారి ఆందోళన నెలకొంది. అయితే ఎటువంటి ప్రమాదం లేదని ఓఎన్‌జీసీ అధికారులు స్థానికులకు చెబుతున్నారు.


నూజివీడు ప్రభుత్వాస్పత్రికి కేంద్ర బృందం



ఏరియా ఆసుపత్రిని పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు

నూజివీడు, జూలై 16: నూజివీడు ఏరియా ఆసుపత్రిని మంగళవారం నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో 17 మంది కేంద్ర బృంద సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా పశ్చిమ బెంగాల్ వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి నారాయణ స్వరూప్ నిగమ్, నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్ సరోజ్‌కుమార్, మధ్యప్రదేశ్‌కు చెందిన నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్ ప్రియాంక దాస్ ఏరియా ఆసుపత్రిలో రోగులకు అందుతున్న సేవలు, ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ పనితీరు, ఎన్‌సీడీ ప్రోగ్రామ్, కార్డియాక్ వైద్యంలో స్టెమ్ ఇంజక్షన్‌లు ఇస్తున్న విధానాలను పరిశీలించారు. రోగులను వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్య సేవలపై వైద్యులను అభినందించారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ నరేంద్రసింగ్, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

స్వల్పంగా తగ్గిన గోదావరి



స్పిల్‌వే వద్ద గోదావరి జలాలు

పోలవరం, జూలై 16 : పోలవరంలో గోదావరి నీటిమట్టం మంగళవారం సాయంత్రానికి స్వల్పంగా తగ్గింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు గోదావ రి నదిలోకి కలుస్తున్న వరద జలాలను స్పిల్‌వే నుంచి ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేయడం వల్ల సాధారణ నీటిమట్టం మాత్రమే నమోదైంది. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 27.050 మీటర్లు, స్పిల్‌వే దిగువన 17.150 మీటర్లు, కాఫర్ డ్యాంకి ఎగువన 27.130 మీటర్లు, కాఫర్ డ్యాంకి దిగువన 16.220 మీటర్లు నమోదైనట్టు ఈఈలు పి. వెంకటరమణ, మల్లికార్జునరావు తెలిపారు.

పట్టిసీమ నుంచి 5,310 క్యూసెక్కులు విడుదల

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 5,310 క్యూసెక్కుల గోదావరి వరద జలాలను ప్రాజెక్టు కుడి కాల్వకు విడుదల చేశామని పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు పెద్దిరాజు మంగళవారం తెలిపారు. పట్టిసీమలో గోదావరి నీటిమట్టం 15.553 మీటర్లకు చేరుకుందని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 15 పంపులు 15 మోటార్లతో నీటిని విడుదల చేసినట్టు తెలిపారు. ఈనెలలో ఇప్పటివకు 6.2057 టీఎంసీల నీటిని విడుదల చేసినట్టు తెలిపారు.

గుండెపోటుతో సీనియర్ అసిస్టెంట్ సత్యరాజు మృతి



సత్యరాజు (ఫైల్)

లింగపాలెం, జూలై 16:లింగపాలెం మండలం ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పరసా సత్యరాజు(53) మంగళవారం ఉదయం గుండెపోటుతో మరణించారు. ఆయన మరణవార్త తెలుసుకున్న ఏపీఎన్జీవో సంఘ నాయకుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, ఎన్జీవో నాయకులు, ప్రముఖులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబసభ్యులకు సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఎన్జీవో నాయకుడు అబ్రార్ హుస్సేన్, మురళీమోహన్, రాజు, వి.రమేష్, సంపత్, కుమారి తదితరులు పాల్గొన్నారు.

గోపీనాథపట్నం కంపెనీలో దొంగతనం

ఉంగుటూరు, జూలై 16 : ఉంగుటూరు మండలం గోపీనాథపట్నంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఈనెల 14వ తేదీ రాత్రి దొంగతనం జరిగింది. కంపెనీలో రూ.3,44,961 నగదు దొంగతనం జరిగిందని కంపెనీ టీం లీడర్ బోడపాటి మహేష్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ ఎ.మణికుమార్ తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

ముదినేపల్లి, జులై 16: అయిదేళ్ల క్రితం బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి మచిలీపట్నం పోక్సో కోర్టు జడ్జి జి.వెంకటేశ్వర్లు మూడేళ్ల జైలు, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు ఇచ్చారు. పోలీసుల వివరాల ప్రకారం 2018 అక్టోబరు 25న ముదినేపల్లి మండలం లోని ఒక గ్రామంలో బాలికకు మా యమాటలు చెప్పి అదే గ్రామానికి చెందిన సునీల్ కుమార్ లైంగిక దాడికి పాల్పడ్డాడు. దీనిపై బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ వి.రాజేంద్ర ప్రసాద్ పోక్సో కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి పలువురు సాక్షులను విచారించిన అనంతరం మంగళవారం జడ్జి తీర్పునిచ్చినట్లు కైకలూరు రూరల్ సీఐ కృష్ణకుమార్, ముదినేపల్లి ఎస్‌ఐ వెంకట్‌కుమార్ తెలిపారు.

భారంగా అంగన్‌వాడీ కేంద్రాలు

- మెనూ అమలు చేయలేక నిర్వాహకుల పాట్లు
- కూటమి ప్రభుత్వమైనా పట్టించుకోవాలని విజ్ఞప్తి



అత్తిలి, జూలై 16: మాతా శిశు సంక్షేమ శాఖ (ఐసీడీఎస్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ భారంగా మారిందని సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో పాలకులు ఇచ్చిన హామీలు హామీలుగానే మిగిలాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవనాల అద్దె కూడా ఏ నెలకానెల చెల్లించలేని దుస్థితి ఏర్పడిందని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని వేడుకుంటున్నారు.

పెరిగిన ఖర్చులతో మెనూ అమలెలా ?

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే ప్రి స్కూలు పిల్లలకు వండి పెట్టేందుకు ఆకుకూరలు, కూరగాయలు, టమోటా వంటివి రోజువారీ కొనుగోలు చేయాల్సి వస్తోంది. వీటితో పాటు కారం, చింతపండు, పసుపు, పోపు సామాన్లు ఎప్పటికప్పుడు సిద్ధం చేసుకోవాలి. వీటి కొనుగోలుకు ప్రభుత్వం ఇస్తున్న నిధులు ఏ మాత్రం సరిపోకపోవడంతో మెనూను అమలు చేయలేని పరిస్థితి నెలకొంది. పిల్లల్లో ఒక్కొక్కరికి బియ్యం 75 గ్రాములు, కందిపప్పు 15 గ్రాములు, వంట నూనె 5 గ్రాముల చొప్పున ఇస్తున్నారు. పోపుల నిమిత్తం ఒక్కొక్కరికి రూ.1.50 చొప్పున కేటాయిస్తున్నారు. ప్రస్తుతం పెరిగిన కూరగాయల ధరలతో వండి పెట్టడం భారంగా మారిందని, సొంత సొమ్ము వెచ్చించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్‌కు 50 పైసలు చొప్పున చెల్లిస్తున్నారని, ఒక్కొక్క గ్యాస్ సిలిండర్‌ను రూ. 900 పెట్టి కొనుగోలు చేస్తున్నామని అయితే ప్రభుత్వం ఇచ్చేది రూ. 700 మాత్రమేనని చెబుతున్నారు. తణుకు ఐసీడీఎస్ కేంద్రంలోని 233 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాలను పర్యవేక్షించాల్సిన అధికారులు మెనూ సక్రమంగా అమలు చేస్తున్నారా లేదా అనేది ఎప్పటికప్పుడు చూడాల్సిన బాధ్యత ఉంది. కార్యకర్తలు ఒక్కసారిగా ధరలు పెరగడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి ఉండడంతో ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ సక్రమంగా అమలు కావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

క్రైం కార్నర్

వామ్మో.. దొంగలు

- పెనుమంట్ర మండలంలో పెరిగిన చోరీలు
- కొరవడిన నిఘా.. తాళంవేసిన ఇళ్లే టార్గెట్
- బంగారం, వెండి, నగదు చోరీ



పెనుమంట్ర, జూలై 16 : పెనుమంట్ర మండలంలో గత పదిహేను రోజుల వ్యవధిలో వరసగా మూడు దొంగతనాలు జరగడంతో ప్రజలు వామ్మో దొంగలు ఇంటికి తాళాలు వేస్తే దోచేస్తున్నారు అంటూ భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఇటీవల నత్తా రామేశ్వరం, పొలమూరు బ్రాహ్మణ చెరువు గ్రామాల్లో వరుస దొంగతనాలు జరగడంతో ప్రజలు భయపడుతున్నారు. నత్తా రామేశ్వరంలోని కిరాణా వ్యాపారం చేస్తున్న షావుకారు ఇంటిలో చోరీ జరిగిందని, సుమారు ఐదు లక్షల విలువైన బంగారు ఆభర ణాలు తస్కరించుకుపోయారని చెబుతున్నారు. గతవారం పెనుమంట్ర మండలం పొలమూరులో కడలి సత్యనారాయణ మాస్టారు శనివారం, ఆదివారం సెలవు రావడంతో ఇంటికి తాళాలు వేసి ఊరికి వెళ్లి వచ్చేసరికి ఇంటిలో ఉన్న బంగారు ఆభరణాలు రూ.50 వేల నగదు, టీవీ, హోమ్ థియేటర్, వెండి వస్తువులు చోరీకి గురి కావడంతో పోలీసులను ఆశ్రయించారు. క్లూస్ టీం వేలిముద్రలు సేకరించినప్పటికీ కేసులో పురోగతి లేదు. ఆదివారం బ్రాహ్మణ చెరువులో ఇంటికి తాళం వేసి తోడు కోడలు ఇంటిలో నిద్రించేందుకు వెళ్లి ఉదయం వచ్చేసరికి తలుపులు బద్దలు కొట్టి బీరువాలోని బంగారం, డబ్బు, వెండి వస్తువులు దోచుకుపోయారు. బ్రాహ్మణ చెరువులోని రాజశేఖర్‌రెడ్డి కాలనీకి చెందిన మహిళ మైలాబత్తుల ధనలక్ష్మికి చెందిన ఆరున్నర కాసుల బంగారం, పదిహేను తులాల వెండి, ఏడు వేల రూపాయలు నగదు దొంగిలించకపోయారు ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్లూస్ టీం సిబ్బంది వేలి ముద్రల సేకరించారు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెబుతున్నారు. ఇవే కాకుండా ఇంటి బయట పార్కింగ్ చేసిన మోటార్ సైకిళ్లు, రొయ్యల చెరువుల వద్ద మోటార్ ఇంజన్లు, వైర్లు చోరీకి గురయ్యాయి. ఏ కేసులోనూ పురోగతి లేదు. మండలంలోని ప్రజలు రాత్రి అయ్యేసరికి ఏ మూల నుంచి ఏ వార్త వినవలసి వస్తుందోనని భయపడిపోతున్నారు. పోలీస్ శాఖ అధికారులు రాత్రి వేళల్లో గస్తీ తిరుగుతున్నప్పటికీ చోరీలు జరగడంతో పోలీసులు నిఘా కొరవడిందని విమర్శలు వినిపిస్తున్నాయి. రెండేళ్ల క్రితం పెనుమంట్ర గరువులో హైదరాబాద్ వెళ్లి తిరిగి వచ్చేసరికి ఇంట్లో ఉన్న బంగారం భారీగా దోచుకుపోయారు. అప్పుడు ఎస్పీ స్వయంగా వచ్చి దర్యాప్తు చేశారు. ఈ కేసులో రికవరీ జరగకపోవడం విమర్శలకు తావిస్తోంది. దొంగతనాలు జరిగిన ప్రాంతాల్లో పోలీసులు కేసులు నమోదు చేసి మొక్కుబడిగా దర్యాప్తు చేస్తున్నారని విమర్శలు బహిరంగంగానే చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని పూర్తిస్థాయిలో రికవరీ చేయాలని స్థానికులు కోరుతున్నారు.



చిందర వందరగా పడివున్న వస్తువులు.. వేలి ముద్రలు సేకరిస్తున్న నిపుణులు (ఫైల్)

స్నేహితులతో ఆడుకోవడానికి వెళ్లి..

- విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి



ప్రసాద్ మృతదేహం

పోలవరం జూలై 16 : సరదాగా స్నేహితులతో ఆడుకోవడానికి వెళ్లి విద్యుదాఘాతంతో ఓ విద్యార్థి మృతి చెందిన ఘటన పోలవరంలో మంగళవారం ఉదయం జరిగింది. పోలవరం ఎస్‌ఐ పవన్ కుమార్ తెలిపిన వివరాలివి.. పాత పోలవరానికి చెందిన కోవేటి ప్రసాద్(11) పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. కడమ్మ స్లూయి జ్ వద్దకు తన స్నేహితులతో వెళ్లి స్లూయిజ్ వద్ద బహిర్భూమికి వెళుతూ తెగిపడి ఉన్న విద్యుత్ వైరుని పట్టుకోవడంతో షాక్‌కి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. విద్యార్థి తండ్రి పోసియ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ విషయంపై విద్యుత్ శాఖ ఏఈ కొండా సత్యనారాయణను వివరణ కోరగా విషయం తెలిసిన వెంటనే తమ సిబ్బంది ఘటనా ప్రాంతానికి వెళ్లి సరఫరా నిలిపివేశారన్నారు. న్యూట్రల్ వైరు తెగిపడడం వల్ల ప్రమాదం సంబవించిందన్నారు. బాలుడి కుటుంబానికి విద్యుత్ శాఖ తరఫున నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

ఆచంట, జూలై 16 : కోడేరు శివారు ఉత్తరపాలెంలో వివాహిత శీలం నాగలక్ష్మి(25) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఎస్‌ఐ ఎం.రాజ్‌కుమార్ తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన శీలం నాగలక్ష్మికి ఇటీవలే సిద్ధాంతంకు చెందిన సాయిబాబాతో వివాహ మైంది. ఆషాఢమాసం నిమిత్తం పుట్టింటికి రాగా ఈనెల 13న ఇంటి వద్ద పురుగుల మందు తాగడంతో వెంటనే కుటుంబ సభ్యులు భీమవరం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. భర్త వేధింపుల కారణంగానే ఆమె పురుగు మందుతాగినట్టు సమాచారం. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

వరకట్నం వేధింపులపై కేసు

భీమవరం క్రైం, జూలై 16 : తన భర్త, అత్తమామలు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ ఓ మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వన్‌టౌన్ ఎస్‌ఐ మణమ్మ తెలిపిన వివరాలివి.. భీమవరం 4వ వార్డుకు చెందిన కాటకి జయకుమారికి భీమవరం మండలం గూట్లపాడు గ్రామానికి చెందిన కాటికి యేసురాజుకు కొంతకాలం క్రితం వివాహమైంది. కొద్దిరోజులుగా భర్త యేసురాజు అత్త, మామ అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ మంగళవారం ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

చెల్లని చెక్కులిచ్చిన నిందితుడికి ఆరు నెలల జైలు, రూ.2 లక్షల జరిమానా

నూజివీడు టౌన్, జూలై 16: చెల్లని చెక్కు కేసులో నిందితుడికి ఆరు నెలల జైలు శిక్ష, రూ. 2లక్షల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. నూజివీడు పట్టణానికి చెందిన వ్యాపారి రాసాబత్తుల వెంకట్రావు 2016 జూలైలో విశాఖపట్నానికి చెందిన ఎడ్ల వెంకటేశ్వరరావుకు రూ.3 లక్షలు అప్పుగా ఇచ్చాడు. బాకీ తీర్చమని వెంకట్రావు అడగ్గా వెంకటేశ్వరరావు రూ. లక్షా 50 వేలకు మూడు చెక్కులు ఇవ్వగా అవి చెల్లుబాటు కాలేదు. ఈ నేపథ్యంలో వెంకట్రావు కోర్టులో కేసు దాఖలు చేయగా, నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి కేసును విచారించి నిందితుడు వెంకటేశ్వరరావుకు జైలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

వెల్డింగ్ చేస్తూ కింద పడి ఒకరి మృతి

ఆకివీడు, జూలై 16 : ఐరన్ షాపునకు వెళ్లి వెల్డింగ్ చేస్తూ పైపును కట్ చేస్తుండగా కింద పడి మృతి చెందిన ఘటన ఆకివీడులో జరిగింది. ఎస్‌ఐ బత్తిన నాగబాబు తెలిపిన ప్రకారం.. ఆకివీడు సంతమార్కెట్ ప్రాంతానికి చెందిన ఏలూరి వెంకన్న(43) వెల్డింగ్ పనిచేస్తూ జీవిస్తున్నాడు. మంగళవారం కొత్తబస్టాండ్ సమీపంలో వున్న ఓ షాపునకు వెళ్లి ఐరన్ పైపు వెల్డింగ్ చేస్తూ కట్ చేస్తూ కిందపడిపోయాడు. సత్వరమే ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. భార్య కిరణ్‌కుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

బాలికపై అత్యాచారం

- యువకుడితో పాటు మరో ముగ్గురిపై పోక్సో కేసు

టి.నరసాపురం, జూలై 16: ఇంటర్ చదువుతున్న బాలికపై అత్యాచారానికి పాల్పడిన యువకుడితో పాటు అతడికి సహకరించిన మరో ముగ్గురిపై పోక్సో కేసు నమోదు చేసిన ఘటన టి. నరసాపురం మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. మండలంలో ఓ గ్రామానికి చెందిన బాలిక జంగారెడ్డిగూడెం ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ పూర్తి చేసి ఇంటివద్దే ఉంది. అదే గ్రామానికి చెందిన యువకుడు తాడి నాగకుమార్ స్థానికంగా హైస్కూల్‌లో చదివే సమయంలో ప్రేమపేరుతో బాలిక వెంటపడి ప్రేమించినట్టు సమాచారం. ఈ క్రమంలో 2023 ఆగస్టులో జంగారెడ్డిగూడెం హాస్టల్లో ఉంటూ చదువుతున్న బాలిక సెలవులకు ఇంటికి వచ్చి తిరిగి వెళ్లగా హాస్టల్ తెరవకపోవడంతో విషయం తెలుసుకున్న యువకుడు జంగారెడ్డిగూడెం వెళ్లి బాలికను గ్రామానికి తీసుకువచ్చి రాత్రి స్థానిక సచివాలయంలో ఉంచి శారీరకంగా అనుభవించాడు. అనంతరం ఈనెల 6వ తేదీ రాత్రి యువకుడు బాలికకు ఫోన్‌చేసి మాట్లాడాలని చెప్పి మరో యువకుని సాయంతో ఆ బాలికను సచివాలయం వద్దకు తీసుకువచ్చారు. అక్కడ ఉన్న మరో ఇద్దరు యువకుల సాయంతో ఏలూరు రైల్వేస్టేషన్ వద్దకు చేరుకుని అక్కడి నుంచి నిందితుడు బాలికను రైల్లో వైజాగ్ తీసుకెళ్లి ఓ హోటల్లో పలుమార్లు శారీరకంగా అనుభవించాడని తెలిసింది. అనంతరం ఇంటికి తీసుకువచ్చి దింపి వెళ్లిపోయాడని బాలిక ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

మహిళ అదృశ్యం.. కేసు నమోదు

లింగపాలెం, జూలై 16: తువ్వచిలుకరాయుడుపాలెం గ్రామానికి చెందిన ఓ మహిళ కనిపించడం లేదంటూ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పి.చెన్నారావు తెలిపారు. గ్రామానికి చెందిన వలసపల్లి వెంకటలక్ష్మి అనే మహిళ గత ఏప్రిల్ 11వ తేదీన ఏలూరులోని ఆసుపత్రికి వెళుతున్నానని ఇంటిదగ్గర నుంచి బయలుదేరి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ కానరాలేదు. మంగళవారం కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

చెరుకువాడలో వ్యక్తి అదృశ్యం.. కేసు

ఉండి జూలై 16: ఓ వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఉండి పోలీసులు తెలిపారు. మంగళవారం రాత్రి ఉండి మండలం చెరుకువాడకు చెందిన ఏలేటి విజయలక్ష్మి తన భర్త కృపావరం 2017 ఆగస్టు 7వ తేదీ నుంచి సుమారుగా ఏడేళ్లుగా నుంచి కనిపించడం లేదని ఆమె ఫిర్యాదు చేసింది. తన భర్తకు మతిస్థిమితం లేదని ఆమె తెలిపింది. బయటకు వెళ్లి వస్తుంటాడని అదేరీతిలో వస్తాడనుకుని చూస్తున్నాం.. ఇప్పటివరకు తమ వద్దకు రాలేదని ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ లక్ష్మణ్ తెలిపారు.

రేపటి నుంచి కుష్టు వ్యాధిపై సర్వే

నరసాపురం టౌన్, జూలై 16: పట్టణంలోని 31 వార్డుల్లో బుధవారం నుంచి కుష్టువ్యాధిపై ఆగస్టు 2 వరకు సర్వే చేపడుతున్నట్లు లెప్రసీ ప్రోగ్రాం అధికారి జక్కంపూడి రామప్రసాద్ తెలిపారు. ఇప్పటికే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆశవర్కర్లకు దీనిపై అవగాహన కల్పించామన్నారు. కుష్టువ్యాధిపై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేస్తామన్నారు. వ్యాధి కారణాలు, చికిత్స, నివారణ చర్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు.

వృద్ధుడి ప్రాణాలు కాపాడిన ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు

నరసాపురం టౌన్, జూలై 16: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో గుండెపోటుతో బాధపడుతున్న వృద్ధుడికి సకాలంలో వైద్యం అందించడంతో పాటు రూ.40వేల ఖరీదైన ఇంజక్షన్ ఇవ్వడం వల్ల ప్రాణాలు కాపాడారు. రుస్తుంబాద వీవర్స్‌కాలనీకి చెందిన సుబ్రహ్మణ్యం (66) చాతినొప్పి తగ్గకపోవడంతో బంధువులు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. డాక్టర్ జాన్ హారిసన్, డాక్టర్ కె.లీలా మారుతీలు వృద్ధుడికి వైద్యం చేసి ఇంజక్షన్ ఇచ్చారు. మెరుగైన వైద్యం కోసం కాకినాడ ఆస్పత్రికి తరలించినట్లు వైద్యులు తెలిపారు. ఉత్తమ వైద్యం అందించిన డాక్టర్లను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆర్.సుప్రియ అభినందించారు.

స్వర్ణాంధ్ర విద్యార్థులకు ఉద్యోగాలు

నరసాపురం రూరల్, జూలై 16: మండలంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు టీసీఎస్ కంపెనీ నిర్వహించిన ఇంటర్వ్యూలో ఎంపికై ఉద్యోగాలు సాధించారు. జాహ్నవి, శ్రీ నిఖిల, నాగధనలక్ష్మి ఉద్యోగాలు సాధించారు. వీరిని మంగళవారం కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ, కోశాధికారి స్వామి, డైరెక్టర్ శ్రీహరి, ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్, గోపిచంద్, విభాగపతి బి.రామకృష్ణ అభినందించారు.

మొక్కు చెల్లించుకున్న టీడీపీ నాయకులు

తణుకు, జూలై 16: ఎమ్మెల్యేగా ఆరిమిల్లి రాధాకృష్ణ విజయం సాధించాలని మొక్కుకున్న టీడీపీ దువ్వ నాయకులు మంగళవారం దానేశ్వరి అమ్మవారి అలయానికి పాదయాత్రగా వెళ్లి మొక్కు తీర్చుకున్నారు. గ్రామంలోని అమ్మవారి ముఖద్వారం వద్ద కొబ్బరికాయలు కొట్టి, ఎన్టీఆర్, వంగవీటి విగ్రహాలకు పూలమాలలు వేసి దానేశ్వరి అమ్మవారి ఆలయానికి పాదయాత్రగా వెళ్లారు.

ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాల ఏర్పాటు

తణుకు, జూలై 16: పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను ఈ నెల 23 నుంచి 27 వరకు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ టీవీ రమణ తెలిపారు. పట్టణంలోని పాఠశాలలు, వార్డు సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆధార్ మొబైల్ కేంద్రాలు పనిచేస్తాయని చెప్పారు. ఆయా కేంద్రాలలో ఐదేళ్ల లోపు పిల్లలు కొత్త నమోదు, డేట్ అప్‌డేషన్ చేయడం జరుగుతుందన్నారు.

డెంగీ, అతిసారపై అవగాహన ర్యాలీ



ఆకివీడు, జూలై 16 : గ్రామాల్లో ప్రజలు అంటు వ్యాధులు బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఈవోపీఆర్డీ సుబ్బారావు అన్నారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా మంగళవారం చెరుకుమిల్లి, కమతవాని గూడెం గ్రామస్థులకు డెంగీ, అతిసార వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి గోవర్ధిని, హెల్త్ సూపర్ వైజర్ సుబ్బలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ వి.సరోజని, ఏఎన్ఎం కృపలత పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చాలి



బేతపూడి, తుందుర్రు ఆర్అండ్‌బీ రోడ్డు మీద నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

భీమవరం రూరల్, జూలై 16 : వెంప, బేతపూడి, తుందుర్రు ఆర్ అండ్‌బీ రోడ్డులో గుంతలు పూడ్చి ప్రమాదాలను అరికట్టాలని సీపీఎం మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కరుకువాడ బేతపూడి గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం నాడు ఆర్అండ్‌బి రోడ్డు మీద నిరసన తెలిపారు.

పేదలకు ఉచిత గ్యాస్ కనెక్షన్

పాలకొల్లు అర్బన్, జూలై 16 : ప్రధాన మంత్రి ఉజ్వల యోజన (పీఎంయువై) పథకంలో భాగంగా పేదలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్ ఇవ్వనున్నట్టు పట్టణంలో నూతనంగా ప్రారంభించిన హెచ్‌పీ గ్యాస్ కంపెనీ డీలర్ గుడాల ఈశ్వర చంద్ర తెలిపారు. మంగళవారం గ్యాస్ కంపెనీలో మాట్లాడుతూ హెచ్‌పీ గ్యాస్ కెంపెనీని పట్టణంలో 2వ బ్రాంచ్‌గా ఉమా నాగ పద్మవతి గ్యాస్ కంపెనీగా ఇటీవల ప్రారంభించడం జరిగిందన్నారు. ఇప్పటి వరకూ గ్యాస్ కనెక్షన్ లేకుండా ఉన్నవారికి తెల్ల రేషన్‌కార్డు కలిగి ఉన్నవారికి మహిళలపేరుతో కనెక్షన్ ఇవ్వడం జరుగుతుందని ఈశ్వర చంద్ర తెలిపారు. ఇతర వివరాలకు 9490433799 లేదా 08814-273799ను సంప్రదించాలని తెలిపారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్‌లకు దరఖాస్తు చేయాలి

మొగల్తూరు, జూలై 16: కేంద్ర ప్రభుత్వం నిరుపేదలకు ఉచితంగా అందిస్తున్న గ్యాస్ కనెక్షన్‌ల కోసం దరఖాస్తులు ఇవ్వాలని మొగల్తూరు లక్ష్మీ హరి ప్రియ గ్యాస్ డీలర్ అనంతపల్లి గోపాలకృష్ణ కోరారు. హెచ్‌పీ గ్యాస్ స్థాపించి 50 సంవత్సరాలు అయిన సందర్భంగా సేఫ్టీ గ్యాస్ వినియోగంపై వినియోగదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వంట గ్యాస్ సబ్సిడి పొందాలంటే ప్రతీ వినియోగదారుడు విధిగా ఈకెవైసీ చేయించుకోవాలని తెలిపారు.

టీడీపీ నేత నిధులతో రోడ్డుకు మరమ్మతులు



అర్థవరం రహదారిలో గుంతలు పూడుస్తున్న టీడీపీ నేతలు

గణపవరం, జూలై 16 : గత ప్రభుత్వ పాలనలో రోడ్లు సమ స్తం గోతుల మయం అయ్యాయి. గణపవరం మండలం అర్థవరం, జల్లికాకినాడ రహదారి గుంతలమయమైంది. ఎస్.కొండేపాడు, కేశవరం, అప్పన్న పేట, మల్లపురాజు పేట, జల్లికాకినాడ తదితర గ్రామాల ప్రజలు గణపవరం మం డల ప్రభుత్వ కార్యాలయాలకు అర్థ వరం గ్రామం మీదుగానే రాకపోకలు సాగిస్తారు. భారీ వర్షాలకు ఈ రహ దారిలో పెద్దపెద్ద గుంతలు ఏర్పడినప్పటికి గత ప్రభుత్వ పాలకులు, అధికా రులు కనీస మరమ్మతులు చేయలేదు. ఈ నేపథ్యంలో అర్థవరం గ్రామానికి చెందిన ఉంగుటూరు తెలుగు యువత అధ్యక్షుడు అద్దేపల్లి వాసురాజు తన సొంత నిధులతో స్వచ్ఛందంగా గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టారు. సుమారు రెండు కిలోమీటర్లు పొడవున ఉన్న రహదారిలో గుంతలు పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టారు. గ్రామాల ప్రజలంతా ఈ కార్యక్రమం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

వాహనాల వేలం

ఆకివీడు, జూలై 16 : వివిధ కారణలతో పోలీసులు సీజ్ చేసిన వాహనాలకు మంగళవారం స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట బ్యూరో కార్యాలయం దగ్గర జిల్లా అధికారి ఆర్సీహెచ్ చిట్టిబాబు బహిరంగ వేలం పాట నిర్వహించారు. రెండు స్కూటీలు, ఒక పల్సర్ రూ.52వేలు, జీఎస్టీ రూ.9,420లతో మొత్తం రూ.61,420 బ్యాంకులో డిపాజిట్ చేయడం జరిగిందన్నారు.

ప్రజా ప్రతినిధులను విస్మరిస్తే సహించం

పెనుమంట్ర, జూలై 16: గత వైసీపీ పాలనలో గ్రామాల్లో తెలుగుదేశం సర్పంచ్‌లు ఉన్నారో లేదో కూడా అధికారులకు గుర్తు లేదని, ఇక అలా అధికారులు ప్రవర్తిస్తే మాత్రం సహించేదిలేదని వెలగలవారిపాలెం సర్పంచ్ వెలగల సుగుణమ్మ బుల్లిరామిరెడ్డి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పెనుమంట్ర మండల సమావేశం ఎంపీపీ కర్రి వెంకట నారాయణ రెడ్డి(వాసు రెడ్డి) అధ్యక్షతన జరిగింది. వైసీపీ పాలనలో అనేక వాగ్దానాలు చేసి నెరవేర్చలేదని మాజీ నీటి సంఘం అధ్యక్షుడు వెలగల బుల్లి రామిరెడ్డి అన్నారు. దీంతో ఎంపీపీ నారాయణ రెడ్డి, బుల్లి రామిరెడ్డి మధ్య తీవ్రస్థాయిలో వాగ్వివాదం జరిగింది. ఎస్‌ఇల్లింద్రపర్రు వద్ద లాకులు నిర్మాణం చేపట్టలేని బుల్లి రామిరెడ్డి ఆరోపించగా లాకుల నిర్మాణానికి లంచం తీసుకున్నారని ఎంపీపీ ఆరోపిస్తూ దీనిపై కమిటీ వేసి విచారిస్తే తాను నిరూపిస్తానని ఎంపీపీ సవాల్ విసిరారు.

నీట మునిగిన వరి పొలాలు



యండగండిలో నీట మునిగిన నారుమడులు



ఎస్ ఇల్లింద్రపర్రులోమునిగిన పంట పొలాలు

ఉండి జూలై 16: కురుస్తున్న వర్షాలకు నారుమడులు, నాట్లు నీటమునిగాయి. వారం రోజుల నుంచి ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలతో సార్వా పనులు చేపడుతున్న రైతులకు ఆటంకాలు ఏర్పడ్డాయి. యండగండి మీడియం డ్రైయిన్ నీటిప్రవాహం సరిగా ముందుకు లాగకపోవడంతో యండగండి, ఉప్పులూరు ప్రాంతాలకు చెందిన రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు కిలారి తవిటయ్య, పివిఎస్‌గోపాలకృష్ణంరాజు, టమటమల గోపాలకృష్ణలు మాట్లాడుతూ యండగండి మీడియం డ్రైయిన్‌లో గుర్రపుడెక్క, తూడు పేరుకునిపోవడంతో కురిసిన వర్షాలకు నీరు బయటకు లాగకపోవడంతో ఆప్రాంతంలో వేసిన నారుమడులు, నాట్లు మునిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

పెనుమంట్ర: పెనుమంట్ర మండలం గోస్తనీ నది, గొంతేరు, భగ్గేశ్వరం పరీవాహక ప్రాంతాల్లో నాట్లు వేసిన పొలాలు 581 ఎకరాలు ముంపునకు గురయ్యాయని దీనితో పాటుగా 35 ఎకరాల నారు మళ్ళు ముంపునకు గురయ్యాయని మండల వ్యవసాయాధికారి అడబాల జోశ్యుల తెలిపారు. పంట పొలాల్లోనీరు మురుగుకాల్వల ద్వారా మళ్ళించేందుకు అధికారులు తూడు తొలగింపు చేపడుతున్నారు. ఒకటి, రెండు రోజుల్లో ముంపు సమస్య తొలగిపోతుందని అన్నారు.

ముంపు సమస్యకు త్వరలో పరిష్కారం: పితాని

పెనుమంట్ర, జూలై 16 : గోస్తనీ, జీఎన్‌వీ కెనాల్ ఆయకట్టు ప్రాంతం తరచూ ముంపునకు గురవుతుందని శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. మంగళవారం ఇరిగేషన్ ఎస్ఈ, అధికారులతో ముంపు ప్రాంతాల్లో సందర్శించి ముంపుకు గల కారణాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. గోస్తనీ నదిలో పెరిగిపోయిన కిక్కిస, గుర్రపుడెక్క, కలుపు మొక్కను తొలగించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఎమ్మెల్యే కోరారు. జీఎన్‌వీ కెనాల్‌లో పేరుకుపోయిన తూడును తొలగించేందుకు రూ.9 లక్షలు యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించామని ఇరిగేషన్ ఎస్సీ జి శ్రీనివాస్ తెలిపారు. గోస్తనీ నదిలోని కిక్కిస తొలగించేందుకు రూ.20 లక్షలతో టెండర్లు పిలిచామని త్వరలోనే తొలగిస్తామని అన్నారు.

ఉచిత కంటి పరీక్షలు

పెనుగొండ, జూలై 16: పెనుగొండ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద స్కోజో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కంటి పరీక్షలు నిర్వహించి అతి తక్కువ ధరతో కంటి అద్దాలను అందించారు. ఆపరేషన్ అవసరమైన వారికి ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ద్వారా ఉచితంగా ఆపరేషన్ నిమిత్తం చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నక్కా శ్యామలా సోని శాస్త్రి, వార్డు సభ్యులు మండా ప్రసాద్, కార్యదర్శి టి. రత్నాకర రావు పాల్గొన్నారు.

కొత్త క్రిమినల్ చట్టాలు నిలుపుదల చేయాలి



భీమవరంలో కరపత్రాలు చూపుతున్న లాయర్లు

భీమవరం క్రైం, జూలై 16 : కొత్త క్రిమినల్ చట్టాలు అమలు నిలుపుదల చేయాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. కొత్త క్రిమినల్ చట్టాలు వాటి వలన నష్టాలు గురించి వివరిస్తూ మంగళవారం కరపత్రాలు ప్రదర్శించారు, కరపత్రాలు ప్రజలకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆలిండియా లాయర్స్ యూనియన్ ఉభయ జిల్లాల ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి మాట్లాడుతూ భారతరాజ్యాంగము ప్రజలకు కల్పించిన ప్రాథమిక హక్కులకు భంగం కలిగించే విధంగా కొత్త చట్టాలు ఉన్నాయని అన్నారు. కొత్త చట్టాలు కోర్టుల అధికారాలను తగ్గించే విధంగా ఉన్నాయన్నారు.అధికారంలో ఉన్న పార్టీ వారు ప్రతిపక్షంపై, ప్రజలపై కక్ష సాధింపు చర్యలు కోసం రూపొందించుకున్న చట్టాలని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు కాస్ట్రో, అంబేడ్కర్, జి.వెంకటేశ్వరరావు, కుమార్ పాల్గొన్నారు.

తణుకు: కొత్త క్రిమినల్ చట్టాలు రద్దు చేయాలని న్యాయవాదులు మంగళవారం కోర్టు ఆవరణలో కరపత్రాలతో నిరసన తెలిపారు. ఐలు జిల్లా ప్రధాన కార్యదర్శి కామన మునిస్వామి ఆధ్వర్యంలో పలువురు న్యాయవాదులు కొత్త చట్టాలకు వ్యతిరేకంగా కరపత్రాలు చూపుతూ నిరసన తెలిపారు.

పెన్నాడలో డీఎల్‌పీవో విచారణ



పెన్నాడలో డంపింగ్‌యార్డు స్థలం పరిశీలిస్తున్న డీఎల్‌పీవో వెంకట బాలాజీ, అధికారులు

పాలకోడేరు, జూలై 16: పెన్నాడ గ్రామ పంచాయతీని డీఎల్‌పీవో సీహెచ్.వెంకట బాలాజీ మంగళవారం పరిశీలించారు. పెన్నాడ గ్రామానికి చెందిన దళిత నాయకుడు కోరం ముసలయ్య గ్రామంలో పంచాయతీకి చెందిన బావిలను పూడ్చేశారంటూ, హిందూ శ్మశానవాటికను డంపింగ్‌యార్డుగా మార్చేశారంటూ, పెన్నాడ గ్రామంలో జేసీబీ ఖర్చు కింద రూ.35లక్షలు ఖర్చు చేశారంటూ తదితర విషయాలపై డీఎల్‌పీఓకు గతంలో ఫిర్యాదు చేశారు. దీంతో డీఎల్‌పీవో మంగళవారం హిందూ శ్మశానవాటికను పరిశీలించి డంపింగ్‌యార్డు శ్మశానవాటికకు సంబంధంలేకుండా ఏర్పాటు చేయాలని సూచించారు. అదే విధంగా పంచాయతీ బావులు పూడ్చారంటూ వచ్చిన అభియోగాలపై పూర్తి స్థాయి నివేదికను తనకు సమర్పించాలని సూచించారు. ఈయన వెంట ఈఓపీఆర్‌డీ ఎంఎస్ఆర్ ఆంజనేయులు, గ్రామ కార్యదర్శి లక్ష్మీ, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

ట్యూబెక్టమీ ఆపరేషన్ల శిబిరం పరిశీలన



ఆపరేషన్ చేయించుకున్న మహిళతో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌వో

పాలకోడేరు, జూలై 16: ప్రభుత్వ ఆసుపత్రిలో సుఖ ప్రసవాలు జరిగే విధంగా చూడటమే కాకుండా పిల్లలు పుట్టకుండా ట్యూబెక్టమి, వేసక్టమి ఆపరేషన్లు కూడా చేయడం జరుగుతుందని జిల్లా వైద్యాధికారి (డీఎం అండ్‌హెచ్‌ఓ) మహేశ్వరరావు అన్నారు. పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహిస్తున్న ట్యూబెక్టమి ఆపరేషన్ల క్యాంపును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ చేయించుకున్న మహిళలతో మాట్లాడారు. ఆపరేషన్ అనంతరం ఎటువంటి ఆహార నియమాలు పాటించాలి ఏ విధంగా ఉండాలన్న వాటి గురించి మహిళలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సీహెచ్‌వీ.రంగం నాయుడు, సీహెచ్‌ఓ ఎం.సత్యనారాయణ, వైద్య సిబ్బంది ఉన్నారు.

బైట్ కళాశాలకు అటానమస్ హోదా

పాలకోడేరు, జూలై 16: పెన్నాడ గ్రామంలోని భీమవరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (బైట్) కళాశాలకు స్వయం ప్రతిపత్తి (అటానమస్) హోదా వచ్చినట్లు కళాశాల చైర్మన్ అడబాల వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు తమ ఇంజనీరింగ్ కళాశాల జేఎన్‌టీయూకే కాకినాడ అనుబంధ సంస్థగా ఉండేదన్నారు. 2024-25 విద్యా సంవత్సరం నుంచి అటానమస్ సంస్థగా కొనసాగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ అద్దాల శ్రీహరి, ప్రిన్సిపాల్ కొప్పర్తి సురేష్, కళాశాల డైరెక్టర్లు అడబాల సత్యసాయి రామతేజ, అడబాల హర్షతేజశ్రీ, అకాడమిక్ డీన్ డాక్టర్ కురేళ్ళ భాస్కరరావు పాల్గొన్నారు.

ఉచిత గుండె వైద్య పరీక్షలు

అత్తిలి, జూలై 16: స్కిన్నెరపురంలో మంగళవారం డాక్టర్ వైవీ రావు ఉషా కార్డియాక్ సెంటర్, విజయవాడ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ శ్రీనివాసరావు బృందం రోగులను పరీక్షించి మందులు అందజేశారు. ఆపరేషన్లు అవసరమైన వారికి సూచనలిచ్చారు. శిబిరం నిర్వహణ, అవసరమైన సదుపాయాలు గనిశెట్టి శ్రీనివాసరావు ఏర్పాటు చేశారు.

చాంబర్స్ విద్యార్థులకు ఉద్యోగాలు

పాలకొల్లు అర్బన్, జూలై 16 : చాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో సోమ, మంగళవారాల్లో వివిధ కంపెనీలు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 16 మంది ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ డి వెంకటేశ్వరరావు తెలిపారు. ఎంపికైన వారికి నెలకు జీతం, ఇతర అలవెన్సులు కలిపి రూ. 12వేల నుంచి రూ20వేలు వరకూ ఉంటుందని తెలిపారు. విద్యార్థులను కళాశాల చైర్మన్ కేవీఆర్ నరసింహారావు, కార్యదర్శి కలిదిండి రామరాజు, అధ్యాపకులు అభినందించారు.

ధూమపానంతో జీవితాలు నాశనం

ఆకివీడు, జూలై 16 : ధూమపానం, ఖైనీ, గుట్కాలతో జీవితాలు చిన్నాభిన్నమవుతాయని హెడ్ కానిస్టేబుల్ బాలకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక జానకీనగర్‌లోని పాఠశాల విద్యార్థులతో పొగాకు వాడకానికి వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ గజేంద్ర, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విక్రమ్ తదితరులు ఉన్నారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాల అమలుకు కృషి చెయ్యాలి

భీమవరం టౌన్, జూలై 16 : ఎస్సీ, ఎస్టీ చట్టాల అమల్లో రెవెన్యూ, పోలీస్ యంత్రా ంగాలు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సమావేశంలో ఎస్సీ, ఎస్టీ చట్టాలు అమలు, కేసుల పురోగతి, తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కేసులు ఎలా నమోదు చేయాలి, వారు ఎస్సీ, ఎస్టీ అవునా కాదా నిర్ధారణ చేసుకుని న్యాయం చేయాలని అన్నారు. ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ ఊహాజనిత కేసుల్లో ఎఫ్ఐఆర్ నమోదుకు ముందు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. తప్పుడు కేసులు, నకిలీ కుల ధ్రువీకరణ పత్రాల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల సేవలు అద్వితీయం

భీమవరం టౌన్, జూలై 16 : ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో పోలీసులతోపాటు ఎన్‌సీసీ క్యాడెట్ల సేవలు అద్వితీయమని డీఎన్నార్ కళాశాల ఉపాధ్యక్షుడు గోకరాజు పాండు రంగరాజు అన్నారు. సీప్ యక్టివిటీస్ బ్రాండ్ అంబాసిడర్ చెరుకువాడ రంగసాయి ఆధ్వర్యంలో ప్రశంసా పత్రాలను కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లకు అందించారు. ప్రిన్సిపాల్ జి మోజేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్, నరహరిశెట్టి కృష్ణ, పి.రామకృష్ణంరాజు, మేజర్ వీరయ్య పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలసిన ఎస్పీ అజిత



భీమవరం టౌన్, జూలై 16 : ఇటీవల జరిగిన ఎస్పీల బదిలీల్లో విశాఖపట్నానికి బదిలీ అయిన జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల మంగళవారంనాడు కలెక్టర్ చదలవాడ నాగరాణిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆమెకు నాగరాణి జ్ఞాపికను అందించారు.

గేదెకు వైద్య పరీక్షలు

భీమవరం టౌన్, జూలై 16 : వీరవాసరం మండలం తోకలపూడి గ్రామంలో గంజాయి మత్తులో యువకులు గేదెపై అఘాయిత్యం చేశారని అదే గ్రామానికి చెందిన రైతు పిల్లి సీతారామయ్య సోమవారంనాడు స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో కలెక్టర్ నాగరాణి ఆదేశాలతో మంగళవారంనాడు పశుసవర్ధక శాఖ వైద్యులు తోకలపూడి వెళ్ళి గేదెకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరవాసరం ఎస్ఐ రమేష్ కూ డా ఉన్నారు.

అన్నసమారాధన



అన్నం వడ్డిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి, టీడీపీ కన్వీనర్ వలవల బాబ్జి

తాడేపల్లిగూడెం అర్బన్, జూలై 16: పట్టణంలోని తాలూకా సెంటర్ సమీపంలోని అన్న క్యాంటీన్ వద్ద ఎమ్మెల్యే బొలిశెట్టి సహకారంతో మంగళవారం అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను టీడీపీ కన్వీనర్ బాబ్జి సత్కరించారు. బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ, గొర్రెల శ్రీధర్, పోతుల అన్నవరం, పట్నాల రాంపండు, గంధం సతీష్, బండి పెద్దిరాజు, నరిసే సోమేశ్వరరావు, పాలూరి వెంకటేశ్వరరావు, కూటమి శ్రేణులు పాల్గొన్నాయి.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

తాడేపల్లిగూడెం అర్బన్, జూలై 16: పట్టణంలోని 15వ వార్డు సావిత్రిపేటలోని పుంతల ముసలమ్మవారిని మంగళవారం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సంతమార్కెట్ నుంచి సావిత్రి పేట కబేళా వరకు సమస్యలు పరిష్కరించాలని వార్డు జనసేన ఇన్‌చార్జి అడబాల రామారావు ఆధ్వర్యంలో స్థానికులు ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందించారు.

• ఫొటోగ్రాఫర్లకు అండగా ఉంటానని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఫొటోగ్రాఫర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఉషాగ్రాండ్‌లో నికాన్ కంపెనీ కొత్త కెమెరాను మంగళవారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు.

ఉచిత వైద్య సేవలు

తణుకు, జూలై 16: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, జనరిక్ మందులు షాపు సంయుక్తంగా మంగళవారం సంఘ కార్యాలయంలో వృద్ధులకు ఉచిత వైద్య సేవలు నిర్వహించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు బీపీ, షుగర్ పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. సంఘ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు, జిల్లా అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ, సభ్యులు కోసూరి గాంధీ, ఇవటూరి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల పెండింగ్ జీతాలు చెల్లించాలి

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 16: ఉపాధి కూలీల ఏడు వారాల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘ రాష్ట్ర కమిటీ సభ్యుడు కండెల్లి సోమరాజు డిమాండ్ చేశారు. మండలంలోని జగన్నాథపురం సచివాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలిపి సచివాలయ కార్యదర్శి శ్రీనివాసరెడ్డికి మంగళవారం వినతిపత్రం అందించారు.

ముక్కు మూసుకోందే నడవలేం!



ఇరగవరం, జూలై 16 : మండలంలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారింది. అయినపర్రు గ్రామంలో రహదారి వెంబడి చెత్త వేయడంతో అది డంపింగ్ యార్డును తలపిస్తోంది. వర్షాలకు చెత్తాచెదారం కుళ్ళిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఈ దారిన వెళ్లేవారు ముక్కు మూసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఖాళీ కొబ్బరి బొండాల్లో వర్షపు నీరు నిల్వ ఉండడంతో దోమలు, ఈగలు పెరగడంతో పాటు పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ఎక్కడ అంటువ్యాధులు ప్రబలుతాయోనని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు చెత్తాచెదారం తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జుత్తిగ లయన్స్ అధ్యక్షుడిగా రామారెడ్డి

పెనుమంట్ర, జూలై 16 : జుత్తిగ గ్రామ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా డి.వెంకట రామారెడ్డి నియామకం అయ్యారు. మంగళవారం లయన్స్ క్లబ్ సమావేశంలో ప్రకటించారు. ఈ సమావేశంలో ఆయనతో పాటుగా కార్యదర్శిగా జి.జ్యోతి, కోశాధికారిగా ఎస్.రామకృష్ణారెడ్డిని నియమించారు. కార్యక్రమంలో రీజనల్ చైర్ పర్సన్ గొంట్ల కృష్ణమూర్తి, రీజియన్ సెక్రటరీ రమేష్ పాల్గొన్నారు.

మొగల్తూరు డీటీగా నరేష్ కుమార్

మొగల్తూరు, జూలై 16: మొగల్తూరు డిప్యూటీ తహసీల్దార్‌గా జి.నరేష్ కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఈఏడాది ఫిబ్రవరి వరకు మొగల్తూరు డీటీగా విధులు నిర్వహించిన ఆయన అనంతరం జరిగిన బదిలీల్లో పాలకోడేరు డీటీగా బదిలీపై వెళ్ళారు. ఆతర్వాత ఎన్నికల అనంతరం తిరిగి పాలకోడేరు నుంచి మొగల్తూరు డీటీగా బదిలీపై వచ్చారు.

పార్వతీదేవికి శాకాంబరీ అలంకరణ



మొగల్తూరు, జూలై 16: మొగల్తూరులోని పురాతన పార్వతి విశ్వేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి మంగళవారం రాత్రి శాకాంబరీదేవిగా అలంకరించారు. గ్రామానికి చెందిన భక్తులు, ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు కూరగాయలతో అమ్మవారికి అలంకరించి పూజలు నిర్వహించారు.

గౌరీదేవికి ఆషాఢ సారె



అమ్మవారికి సారె తెస్తున్న భక్తులు



పెంటపాడు, జూలై 16: పెంటపాడు వెలమ యువజన సంఘం ఆధ్వర్యంలో గౌరీదేవి అమ్మవారికి మంగళవారం మహిళలు ఆషాఢ సారె సమర్పించారు. తొలుత మేళతాళాలు, గరగ నృత్యాలతో మహిళలు సారె పట్టుకుని గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం శాకాంబరి అవతారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకుని సారె సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు వేలం నిర్వహించారు. వెలమ యువజన సంఘం సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గంగమ్మదేవికి సారె



ఆకివీడు, జూలై 16 : ఆకివీడు నుంచి సిద్దాపురం వైపు వెళ్ళు రైల్వేగేటు సమీపంలోని సమతానగర్ రోడ్‌లోని ఉన్న గంగమ్మదేవి దేవాలయంలో మంగళవారం సమతా నగర్ వాసులు సారే సమర్పించారు.

ముగిసిన వారాహి నవరాత్రి ఉత్సవాలు



108 కలశాలతో అమ్మకు అభిషేకాలు చేస్తున్న భక్తులు

ఆకివీడు, జూలై 16 : ఈ నెల 6 నుంచి వెంకటలింగేశ్వరస్వామి దేవస్థానంలో వారాహి పూజలు ప్రారంభించి మంగళవారం భక్తులు 108 కళశాలతో ప్రత్యేక అభిషేకాలు చేసి ముగించారు. ఏడాదిలో నాలుగు నవరాత్రులుంటాయని వాటిని మనం చేస్తే ప్రత్యేక ఫలితాలుంటాయని అర్చకులు మొవ్వా సుబ్రహ్మణ్యం అన్నారు. ప్రతీరోజు హోమాలు, పూర్ణాహుతులు, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పూజలో నగర పంచాయతీ టీడీపీ ఫ్లోర్ లీడర్ బొల్లా వీరశ్వేత-శేషుబాబు, కౌన్సిలర్ నిమ్మల నాగు, గొడవర్తి మణికంఠ పాల్గొన్నారు.

మాతృమూర్తుల సత్సంగం



మాతృమూర్తుల సత్సగంలో పాల్గొని గోరింటాకు పెట్టుకున్న మహిళలు

పాలకొల్లు, జూలై 16 : వీహెచ్‌పీ ఆధ్వర్యంలో స్థానిక ఏపీఎస్ కాలనీలో మాతృమూర్తుల సత్సగం నిర్వహించారు. ఈకార్యక్రమానికి వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి ఎం.సునీత అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఆషాఢమాసం విశిష్టతను, ఆషాఢంలో గోరింటాకు పెట్టుకోవడంలో గల అవశ్యకతను వివరించారు. సుమారు 80 మంది మహిళలు ఈకార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం మాతృమూర్తుల సౌందర్యలహరి గానామృతం కార్యక్రమం నిర్వహించారు.

మంత్రి అచ్చెన్నాయుడును కలసిన అంగర



పాలకొల్లు అర్బన్, జూలై 16 : రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి అచ్చెన్నాయుడును అమరావతిలోని ఆయన కార్యాలయంలో మంగళవారం కలిసి పలు అంశాలపై చర్చించినట్టు మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ తెలిపారు. అలాగే హోంశాఖ మంత్రి వంగలపూడి అనితను, మంత్రి బాల వీరాంజనేయ స్వామిని కలిసి అభినందించినట్టు అంగర తెలిపారు.

మండలి చైర్మన్‌తో వంక భేటీ



భీమవరం టౌన్, జూలై 16 : ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మంగళవారం శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజుతో భీమవరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ప్రస్తుత పరిస్థితులపై చర్చించారు. జిల్లాలో చేయవలసిన అభివృద్ధి కార్యక్రమాలు, అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రభుత్వానికి చేయవలసిన సూచనలు కోసం కూడా చర్చించామని రవీంద్రనాథ్ తెలిపారు.

హెల్మెట్‌ధారణపై అవగాహన



భీమవరం టౌన్, జూలై 16: పట్టణ ంలో హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ దాస్ మాట్లాడుతూ వాహనదారులందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి, తమ విలువైన ప్రాణాలు కాపాడుకోవాలని అన్నారు. డ్రైవింగ్ సమయంలో హెల్మెట్ ధరించకపోవడంతో రోడ్డు ప్రమాదాల్లో సంవత్సరానికి వందల మంది మృత్యువాత పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ హెల్మెట్ ధరించినంత మాత్రాన ప్రాణాలు పోవు అనే గ్యారంటీ ఏమీ లేదని, అది ఒక రక్షణ కవచంగా ఎంతగానో ఉపయోగపడుతుం దన్నారు. అనంతరం ఆర్ఆర్‌డీఎస్ కళాశాల నుంచి ప్రధాన వీధుల్లో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నరహరిశెట్టి కృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రసూన, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ అరవిందస్వామి పాల్గొన్నారు.



ఉండి మానవత కార్యవర్గం

ఉండి జూలై 16: ఉండి మండలశాఖ మానవతా సంస్థ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా పెన్మెత్స రామకృష్ణంరాజు (ఎల్ఐసీ రాజు) ప్రధాన కార్యదర్శిగా గాదిరాజు రంగరాజు (సాహితీవేత్త), ట్రెజరర్‌గా కర్రెడ్డి తాండవ నాగ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడుగా యర్రా నవీన్, జాయింట్ సెక్రటరీగా పరంశెట్టి ఆంజనేయులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో దంగేటి రామలింగేశ్వరరావు (ఎంపీటీసీ), గాదిరాజు వెంకటేశ్వరరాజులతో పాటు ఎంపీడీవో రవీంద్ర, ఈవోపీ ఆర్డీ రామకృష్ణారెడ్డి నూతనంగా మానవత సభ్యత్వం తీసుకున్నారు. ఎంపీపీ ఇందుకూరి హరినారాయణరాజు, సాగిరాజు జానకీరామరాజు పాల్గొన్నారు.

విద్యావేత్త జంగా గోపాల్ మృతి



తాడేపల్లిగూడెం అర్బన్, జూలై 16: పట్టణంలో పలు విద్యాసంస్థలు ఏర్పాటు చేసి విద్యార్థులను తీర్చిదిద్దిన ప్రముఖ విద్యావేత్త జంగా గోపాల్ (87) అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఏలూరులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో మంగళవారం మృతి చెందారు. ఆయన భౌతిక కాయాన్ని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సందర్శించి నివాళులర్పించారు.